క్లుప్తంగా

జాతీయ పోటీలకు విద్యార్థిని ఎంపిక

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఐటీసీ జాతీయ స్థాయిలో 18 నుంచి బెంగళూరులో నిర్వహించే ఆల్‌రౌండ్ పరీక్షలకు విద్యార్థిని వజీహా తరన్ను ఎంపికైనట్లు రాకేష్ పబ్లిక్ స్కూల్ స్కూల్ డైరెక్టర్ ఎస్వీ.రావు పేర్కొన్నారు. స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వజీహ తరన్నుకు పలువురు అభినందనలు తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో స్కూల్ స్థాయిలో నిర్వహించిన పోటీలలో సీనియర్స్ విభాగంలో వజీహ తరన్ను ఐదు రౌండ్లలో ఉత్తమ ప్రతిభ చూపిందన్నారు. జాతీయ స్థాయి పోటీలతో పాటు రూ. 10 వేల నగదు, సర్టిఫికెట్‌ను అందుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులను చదువుతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు రమేష్, కల్పన, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే సొత్తు చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితులను విజయవాడ ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన దేవ్వళ్ల తిరుపపతిరావు(31), యర్ల తిరుపతయ్య(23) శనివారం మిల్క్‌ప్రాజెక్టు సమీపంలోని చనుమోలు వెంకట్రావు బ్రిడ్జి కింద ఇనుప వస్తువులను దొంగిలించి ఆటోలో తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో ఆర్పీఎఫ్ అప్‌యార్డ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్ ఆదేశాల మేరకు ఏఎస్సై కె.ప్రసాద్, సిబ్బందితో వెళ్లి నిందితులతో పాటు చోరీ సొత్తు తీసుకెళ్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని తెలిపారు. వీరిపై రైల్వే చట్టప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సైక్లింగ్ ఎంపికల ట్రయిల్స్‌కు స్పందన



నున్న(విజయవాడరూరల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) కృష్ణా జిల్లా యూనిట్ ఆధ్వర్యాన నున్న వికాస్ కాలేజీ రోడ్డులో శనివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ సైక్లింగ్ ఎంపిక ట్రయల్స్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. వీటిని వికాస్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎన్.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా ఎస్‌జీఎఫ్ ప్రోత్సహిస్తోందన్నారు. ఫెడరేషన్ అండర్-14, 17 కార్యదర్శి తోట అజయ్ కుమార్ ఈ నెల 12, 13 తేదీల్లో అండర్- 17, 19 బాలబాలికల అంతర్ జిల్లా సైక్లింగ్ చాంపియన్‌షిప్, 16,17 తేదీల్లో అండర్14 చాంపియన్ షిప్‌ను నరసరావుపేట లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శన ఆధారంగా కృష్ణా జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించే బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా సైక్లింగ్ సంఘ ప్రధాన కార్యదర్శి సుగుణరావు, వికాస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు ఎంవీ సత్యప్రసాద్, టి.శ్రీలత, ఎం.వెంకటేశ్వరరావు, విజయవర్మ, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేర్వేరు ప్రాంతాలకు ప్రత్యేక డైలీ ప్యాసింజర్ సర్వీసులు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రాజమండ్రి-విశాఖపట్నం మధ్య 07466 నంబరు రైలు ఈ నెల 14 నుంచి రోజూ నడుస్తుందని తెలిపారు. ఈ రైలు ఉదయం 9.20 గంటలకు రాజమండ్రిలో బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07467 నంబరుతో ఈ నెల 15 నుంచి రోజూ సాయంత్రం 6.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, రాత్రి 11.35 గంటలకు రాజమండ్రి చేరుకుంటుంది. విశాఖపట్నం - విజయనగరం మధ్య 07468 నంబరు ఈ నెల 14 నుంచి రోజూ సాయంత్రం 6.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, రాత్రి 7.50కి విజయనగరం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07469 నంబరుతో ఈ నెల 15 నుంచి ఉదయం 6.10 గంటలకు విజయనగరంలో బయలుదేరి 7.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం-పలాస మధ్య 07470 నంబరు రైలు ఈ నెల 14 నుంచి రోజూ ఉదయం 7.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి, మధ్యాహ్నం ఒంటి గంటకు పలాస చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 07471 నంబరుతో మధ్యాహ్నం 1.30 గంటలకు పలాసలో బయలుదేరి, రాత్రి 7.50 గంటలకు విశాఖపట్నం చేరుతుంది.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం 38వ డివిజన్ 159వ వార్డ్ సచివాలయం పరిధిలో ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి ఇంట్లో అందుతున్న పథకాలకు సంబంధించిన వివరాలతోకూడిన బ్రోచర్‌ను అందజేస్తూ వారివారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. పథకాలు అందని కొందరి వివరాలను తీసుకుని వాటిని సరిచేసి తిరిగి దరఖాస్తు చేయించి అర్హత ఉంటే తప్పనిసరిగా పథకాలు అందేలా చూడాలని వారిని ఆదేశించారు. చివరి వ్యక్తి వరకు ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని పేర్కొన్నారు.

లోకేష్ పాదయాత్రకు ప్రజాదరణ లేదు

నాటి ప్రతిపక్ష నేతగా ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సుదీర్ఘ ప్రజా సంకల్ప యాత్రను చూసి పాదయాత్ర చేపట్టిన లోకేష్‌ను చూస్తుంటే పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుందని వెలంపల్లి ఎద్దేవా చేశారు. అతని పాదయాత్రకు ప్రజాదరణ లేక వెలవెలపోతుందని, అది ఫెయిల్యూర్ యాత్రగా పేర్కొన్నారు. లోకేష్ సభలోని ఒక మహిళ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుందంటే ఆయన పారదర్శక పాలనకు ఫిదా అయినట్లు స్పష్టం అవుతుందన్నారు. నారా వారికి వారాహి వారికి సంబంధం ఏంటని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్, లోకేష్ బఫూన్లని, స్పష్టత, నిలకడ లేనివారి మాటలను విన్న ప్రజలు చక్కగా ఎంజాయ్ చేస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్ ఏ రోజు ఎవరితో ఉంటాడో తెలియదని, అతను ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా ఉపయోగం లేదన్నారు. వారాహి వాహనానికి పూజలు చేయించి షెడ్‌లో పెట్టి తిరిగి షూటింగ్‌ల్లో పాల్గొంటున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు అనేక దేవాలయాలను కూల్చేస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నింటినీ అద్భుతంగా పునర్నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, బొమ్ము మధు, కటన్ కరీముల్లా, మంటి కోటేశ్వరరావు, జీ వినోద్‌పాల్, లాజర్, రాము, శరత్‌బాబు, రాంబాబు, శ్రీను, ప్రభుదాస్, చంద్రశేఖర్, రుద్రశంకర్, డీవీ రెడ్డి, సచివాలయ కన్వీనర్ నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

బాల బాలికలలోని ప్రతిభను గుర్తించాలి



నృత్యపోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పీవీఎన్ కృష్ణ, భాస్కరశర్మ

విజయవాడ కల్చరల్: బాల బాలికలలోని ప్రతిభను వెలికి తీసి, గుర్తించాల్సిన అవసరముందని సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో భరతముని జయంతి సందర్భంగా రెండురోజుల నిర్వహించే రాష్ట్రస్థాయి సంప్రదాయ నృత్య పోటీలను గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ యువత ప్రగతి పథం వైపు నడుస్తోందన్నారు. వారిలోని ప్రతిభను వెలికితీసి వారిని సంస్కారవంతమైన యువతగా తీర్చిదిద్దేందుకు సంస్కార భారతి కృషి చేస్తోందన్నారు. సంస్కార భారతి మహానగర్ (విజయవాడ) అధ్యక్షుడు భాస్కర శర్మ మాట్లాడుతూ భారతీయ నాట్యాశాస్త్రలకు ఆదిపురుషుడు భరతముని అని, ఆయన రచించిన నాట్యశాస్త్రం ప్రామాణిక గ్రంథంగా అభివర్ణించారు. భరతముని జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. నాట్యచార్యుడు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు, వై అనురాధ, న్యాయనిర్ణేతలగా వ్యవహరించారు. సంస్కారభారతి నగర కార్యదర్శి సీతారత్నం, సంస్కార భారతి నాట్యవిభాగం నిర్వాహకులు జీ కుసుమ సాయి, బీ రూపాశ్రీ, కే వాసుదేవరావు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సైన్స్ క్వెస్ట్



విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకిస్తున్న సందర్శకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో నిర్వహించిన డాక్టర్ సుధ సైన్స్ క్వెస్ట్-2023లో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల ప్రాజెక్టులో చూపరులను ఆలోచింప జేశాయి. ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, సోలార్ సిస్టమ్‌తో విద్యుత్ ఆదా, నీటి ప్రాజక్టులు, నూతన టెక్నాలజీతో సెక్టర్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చు తదితర అంశాలకు సంబంధించి ప్రాజక్ట్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేఎల్ యూనివర్సిటీ కెమిస్ట్రీ హెచ్ఓడీ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు సైన్స్ క్వెస్ట్‌ను ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ టీ సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ తన తల్లి సుదర్శనమ్మ స్మృత్యర్థం ప్రతి ఏటా సైన్స్ క్వెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సైన్స్ క్వెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు కేఎల్‌యూ బయాలజీ హెచ్ఓడీ డాక్టర్ కె గిరిధర్ బహుమతులను అందజేశారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన ఎంఎస్సీ అధ్యాపకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ టీ మోనికా సుమన్, అకడమిక్ హెడ్ రామాభారతి, ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం

వైభవంగా గరుడవాహన సేవ



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న శ్రీవారి రథోత్సవం శనివారం అత్యంత నేత్రపర్వంగా జరిగింది. బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రాత్రి స్వామి రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉభయదేవేరులతో కూడిన స్వామిని రథంపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, వేదపఠనం, విచిత్ర వేషధారణల మధ్య రథం ముందుకు సాగింది. తొలుత ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు పలువురు ప్రముఖులు కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు.

ఘనంగా గరుడోత్సవం

ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి గరుడోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కల్యాణోత్సవాన్ని నిర్వహించిన అర్చకస్వాములు శనివారం ఉదయం స్వామికి గరుడోత్సవాన్ని నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి నిర్వహించారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి పునఃప్రతిష్ట మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిరిడీసాయిబాబా మందిరంలో దత్తాత్రేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం రెండో రోజున ఘనంగా నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి దంపతులు మహోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమాలను మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళామణులను గుర్తించి సర్వేజనాః సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళారత్న, మహిళా శిరోమణి అవార్డులతో సత్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల అభ్యున్నతికి సేవలు అందిస్తున్న మహిళలను వచ్చే నెల 12వ తేదీన హైద్రాబాద్‌లో పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు. అర్హత కలిగిన మహిళలు వారు అందించిన సేవల వివరాలతో ఈ నెల 15వ తేదీలోపు సర్వేజనా సుఖినోభవంతు, డోర్ నంబర్ 1-20-164, పోస్టు తిరుమలగిరి, గోకుల్‌నగర్, వెంకటాపురం సికింద్రాబాద్-15 చిరునామాకు పంపించాలని పేర్కొన్నారు. సమాచారం కోసం 96523 47207లో సంప్రదించాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక బడ్జెట్ అని సీఐటీయూ పేర్కొంది. శనివారం గవర్నర్ పేట లెనిన్ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ. వెంకటేశ్వరరావు ,సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎంవీ సుధాకర్ మాట్లాడుతూ బడ్జెట్ ప్రతిపాదనలు సవరించాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనకు సీఐటీయూ సిద్ధమవుతోందన్నారు. సీఐటీయూ నాయకులు కమల, దుర్గారావు, సీతారాములు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నా

మధుర స్వరాల గాయని వాణి జయరాం



విజయవాడ కల్చరల్: మధుర స్వరాల గాయని వాణి జయరాం అని శ్రీకళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. సాంస్కృతిక కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద శనివారం గాయని వాణి జయరాం సంస్మరణ సభ నిర్వహించారు. వివిధ కళాసంస్థల ప్రతినిధులు దండు చంద్రశేఖర్, చింతకాయల చిట్టిబాబు, చలపతి రావు, మల్లాది స్వాతి, శ్యాంప్రసాద్ తదితరులు వాణి జయరాం చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె సినీ రంగ సేవలను కొనియాడారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ భవిత



నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్రమశిక్షణతోనే ఉత్తమమైన భవిష్యత్‌ను సొంతం చేసుకుంటారని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య పేర్కొన్నారు. మద్ది సుబ్బారావు హైస్కూల్ వార్షికోత్సవాన్ని కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ సుమారు 120 సంవత్సరాల చరిత్ర కలిగిన హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్‌కేజీ నుంచి ఇంజినీరింగ్, పీజీ వరకూ పలు కోర్సులను అందిస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శనతో జరిగింది. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చిట్టూరి అమరసుధీర్, ప్రిన్సిపాల్ శ్యామల పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం



డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభించిన కృష్ణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 45వ డివిజన్ పరిధిలోగల బ్రహ్మయ్యకాలనీలో సైడు డ్రెయిన్ నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ డివిజన్ బాధ్యులు మైలవరపు కృష్ణ శనివారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్డు, సైడు డ్రెయిన్స్ లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.11,24,000 మంజూరు చేయించారని తెలిపారు. వెలంపల్లి సహకారంతో డివిజన్‌లో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. అందులో భాగంగానే ఈ రోజు శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. నాయకులు ముత్తా వాసు, టీ రాజేంద్ర ప్రసాద్, ముత్యాల రాంబాబు, నల్లం వాసు పాల్గొన్నారు.

జీఎస్టీ రాకతో కాస్ట్ అకౌంటెంట్లకు డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న రీజినల్ కౌన్సిల్ చైర్మన్ శంకర్ పీ పణికర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీఎస్టీ రాకతో కాస్ట్ అకౌంటెంట్లకు అవకాశాలు పెరిగాయని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా రీజినల్ కౌన్సిల్ చైర్మన్ శంకర్ పీ పణికర్ అన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం రాష్ట్రస్థాయి సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) స్టూడెంట్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు వెయ్యి మందికిపైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శంకర్ పీ పణికర్ మాట్లాడుతూ.. దేశంలో సీఎంఏ మంచి గుర్తింపు ఉన్న కామర్స్ ప్రొఫెషనల్ కోర్సని పేర్కొన్నారు. సీఎంఏ పూర్తి చేసిన వారికి దేశవిదేశాల్లో అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. సీఎంఏ కోర్సును మూడు స్థాయిల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ కామర్స్‌లో చేరి, సీఎంఏ కోర్సు చేస్తే బీకాం సెకండియర్‌తో పాటు, సీఎంఏ పూర్తి చేయవచ్చని సూచించారు. ఇంటర్మీడియెట్ తర్వాత బీకాంతో పాటు, మూడేళ్లలో సీఎంఏ పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. బీకాం తర్వాత సీఎంఏలో చేరితే 18 నెలల్లో పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఈ కోర్సు చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అత్యధిక పారితోషికంతో ఉద్యోగ అవకాశాలు లభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విద్యార్థులు కామర్స్‌లో తమకున్న పట్టు, ప్రతిభను నిరూపించుకున్నారు. సదస్సులో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్‌లు అందజేశారు. సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.పాపారావు, రీజినల్ కౌన్సిల్ సభ్యుడు కె.పాండురంగారావు, విజయవాడ చాప్టర్ అధ్యక్ష కార్యదర్శులు పి.ఎస్.ఆర్.స్వామి, పి.వినయ్‌రాజన్ పాల్గొన్నారు.

ఎస్పీఎల్ క్రీడా స్ఫూర్తికి నిదర్శనం



రన్నర్ ట్రోఫీ అందుకున్న జట్టును అభినందిస్తున్న లయోలా కాలేజీ ప్రిన్సిపాల్ తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రీడా స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ అన్నారు. గత నెల 25 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన ఎస్పీఎల్ ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి క్రికెట్ సీనియర్స్ విభాగంలో లయోలా కాలేజీ జట్టు రన్నర్ ట్రోఫీని అందుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాలేజీ యాజమాన్యం కాలేజీ క్రికెట్ జట్టును శనివారం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సాక్షి మీడియా గ్రూప్ జిల్లా, రీజినల్, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా జట్లు రానున్న మరిన్ని టోర్నమెంట్లకు ప్రాతినిధ్యం వహించేందుకు ఎస్పీఎల్ దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా క్రికెట్ పోటీలు నిర్వహించిన సాక్షి యాజమాన్యానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్‌జెవిఎల్, అసిస్టెంట్ డైరక్టర్లు ఫాదర్ డి.బాలస్వామి, కె.రవీంద్రనాథ్, పీడీ వై.రాజేష్ పాల్గొన్నారు.

సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక స్పృహను పెంపొందించుకున్నప్పుడే జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించగలరని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమచికిత్స శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం, 'విద్యార్థులు-సామాజిక స్పృహ ' సదస్సు కార్యక్రమాలు ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ విద్యార్థులు స్వలాభాపేక్ష లేకుండా సాటి మనిషికి సహాయపడే తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తమ విద్యలో ప్రతిభ కలిగి ఉండడంతో పాటు క్రమశిక్షణ, మంచి ప్రవర్తన, గౌరవ మర్యాదలు కలిగి ఉండటం అవసరమన్నారు. మంచి మాట తీరు ఉండడంతో పాటు సమాజంలో పది మందికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. రాబోయే తరాల కోసం వనరులను పొదుపుగా వాడటం వంటి సామాజిక ఆలోచన కలిగి ఉండాలన్నారు. నిత్యం ఉపయోగించే సాంకేతిక టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి మనిషి ఒక మానవత్వపు మనిషిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ ద్వారా సమరం చేసిన సేవలను జిల్లా కలెక్టర్ కొనియాడారు. తోటి వారికి గుండె పోటు వంటి ఆకస్మిక సమస్యలు ఎదురయినప్పుడు వారిని కాపాడే విధంగా ప్రథమ చికిత్స, కార్డియోపల్మొనరీ పునర్జీవనం (సీపీఆర్) వంటి చికిత్సలు జిల్లాలో ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఉండాలన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జీ సమరం మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర చాల ముఖ్యమైందన్నారు. సామాజిక సేవ అలవాటు అవ్వాలంటే సొంత లాభం విడనాడాలన్నారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రథమ చికిత్సకు సంబంధించిన శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక చైతన్యం కలిగి ఉండాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యాబోధనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోను కేబీఎన్ కళాశాల ముందువరుసలో ఉందన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమానికి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీఎస్‌రావు స్వాగతం పలకగా పశ్చిమ ఎమ్మార్వో మాధురి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీఓలు డీ పవన్‌కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

మెరుగైన దంత వైద్య సేవలందించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో దంత సమస్యలున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పూర్వ ప్రత్యేక కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్ అన్నారు. ఆయన వైద్యశాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సమయంలో కోల్గేట్ సంస్థ నుంచి ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఆర్థోడాంషియా పీజీ విభాగానికి ఎనిమిది డెంటల్ చైర్స్‌ను అందించారు. వాటిని ఆ విభాగంలో ఇన్‌స్టాల్ చేయగా, శనివారం ఆ పీజీ విభాగాన్ని జీఎస్ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలను అందించాలనే దృక్పథంతో కోల్గేట్ సంస్థ ఎనిమిది డెంటల్ చైర్స్ అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికీ సత్వర, మెరుగైనసేవలు అందించేందుకు ప్రతి వైద్యుడు కృషి చేయాలన్నారు. అనంతరం జీఎస్ నవీన్‌కుమార్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కోల్గేట్ సంస్థ నుంచి డెంటల్ చైర్స్ అందజేసేందుకు సహకరించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ మెహబూబ్ షేక్ పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ రేస్‌లో విజేతలకు సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల మూడు, నాలుగు తేదీలలో గుడివాడ ఏఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ రేస్‌లో విజేతలుగా నిలిచిన ఎస్ఆర్ఆర్ విద్యార్థులను శనివారం కళాశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కళాశాలకు చెందిన క్రాస్ కంట్రీ క్రీడాకారులు కె.మధు, జీ తరుణ్‌కుమార్, వీ తేజోరాం, ఎస్.శివ, టీ వెంకటరమణ గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులను సత్కరించారు.

ప్రలోభాలతో చిచ్చుపెడుతున్న చంద్రబాబు

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రెడ్డి ప్రజాప్రతినిధులను ప్రలోభాలతో లొంగదీసుకుని చిచ్చుపెట్టి సమాజంలో అలజడులు సృష్టించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెడ్డి ప్రజాప్రతినిధులు చంద్రబాబు ట్రాప్‌లో పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రెడ్ల వైఖరిపై అరాచక ధోరణితో ప్రవర్తిస్తున్న టీడీపీలో రెడ్లు ఇమడలేరనే విషయం తెలుసుకోవాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు రెడ్లను అణగదొక్కిన నేపథ్యంలో టీడీపీ నుంచి ఒక్క రెడ్డి కూడా ఎమ్మెల్యేగా గెలవలేదని, ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని గుర్తుచేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సుమారు 350 మందికి పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఫ్యాక్షన్ ను పూర్తిగా నిర్మూలించి శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తుంటే చంద్రబాబు మాత్రం రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించేందుకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. రెడ్డి ప్రజాప్రతినిధులు చంద్రబాబు చరిత్రను గమనించి ప్రలోభాలకు లొంగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.